

రాష్ట్రస్థాయి పోటీలకు రాయకుదురు విద్యార్థిని

వీరవాసరం:వారధి ఫౌండేషన్ ద్వారా జిల్లాస్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచిన రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన పదో తరగతి విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావు గురువారం తెలిపారు. పుచ్చకాయల వెన్నెల వక్తృత్వ పోటీలో 'సోషల్ మీడియా ఈజ్ ఎ యూజ్‌ఫుల్ టూల్ ఫర్ ది స్టూడెంట్ లెర్నింగ్' అనే అంశంపై మాట్లాడి జిల్లాస్థాయిలో ప్రథమస్థానాన్ని సాధించిందన్నారు. వ్యాసరచన విభాగంలో దూది అంజలి 'వాట్ రోల్ షుడ్ స్కూల్స్ ప్లే ఇన్ ప్రమోటింగ్ మెంటల్ హెల్త్' అనే అంశంలో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానాన్ని పొందారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని స్కూల్ అసెంబ్లీలో అభినందించి బహుమతులు అందించారు. వెన్నెల ఈ నెల 18న రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలో ఆన్‌లైన్ విధానంలో పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో కె.వీరాస్వామి, ఆర్.తులసీప్రదీప్, వి.శేఖర్, లక్ష్మీదుర్గ, హరిప్రియ, కెవిడి.ప్రసాద్, బి.రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బస్సు ఆగదు.. ప్రయాణం సాగదు..!

- ఉచిత బస్సు ప్రయాణంతో పెరిగిన ప్రయాణికుల సంఖ్య
- 65 నుంచి 78 శాతం పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో
- ఓఆర్‌కు అనుగుణంగా పెరగని బస్సుల సంఖ్య
- ప్రయాణికులు చెయ్యెత్తినా ఆగని ఆర్‌టిసి బస్సులు
- రెండు జిల్లాల్లో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం
- ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం అందుకు తగిన విధంగా బస్సులను ఏర్పాటు చేయడంలో విఫలమైంది. ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగినా అందుకు తగినన్ని ఆర్‌టిసి బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రయాణికులు చెయ్యెత్తినా బస్సులు ఆగకుండా వెళ్లిపోతున్న పరిస్థితి ఉంది. దీంతో ప్రయాణం ముందుకు సాగక జనం నలిగిపోతున్నారు. ఉచిత బస్సు పథకంతో లక్షలాది మంది లబ్ధి పొందారంటూ లెక్కలతో సరిపెడుతున్నారే తప్ప.. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల గురించి మాత్రం ప్రభుత్వం, ఆర్‌టిసి అధికారులు మాట్లాడటం లేదు. దీంతో ప్రభుత్వంపై ప్రయాణికుల్లో తీవ్ర అసహనం పెరుగుతోంది. ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి తేవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఉచిత బస్సు ప్రయాణంతో ఒఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) భారీగా పెరిగింది. అందుకు తగిన విధంగా ప్రభుత్వం బస్సుల సంఖ్య మాత్రం పెంచడం లేదు. దీంతో జనానికి ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం అందని ద్రాక్షగా మారింది. ఏలూరు జిల్లాలో మొత్తం 309 బస్సులు ఉండగా ఉచిత బస్సు ప్రయాణానికి 177 బస్సులను కేటాయించారు. ఆగస్టు 15 నుంచి ఇప్పటి వరకూ ఉచిత బస్సుల్లో 31.28 లక్షల మంది మహిళలు ప్రయాణించారు. ఉచిత బస్సు ప్రయాణం రాకముందు ఏలూరు జిల్లాలో ఓఆర్ 65 శాతం వరకూ ఉండగా ఇప్పుడు 78 శాతానికి పెరిగింది. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 298 బస్సులు ఉండగా ఉచిత బస్సు కింద 213 బస్సులను కేటాయించారు. ఇప్పటి వరకూ ఉచిత బస్సు ప్రయాణం కింద 44.74 లక్షల మంది మహిళలు ప్రయాణాలు సాగించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఆగస్టు 15కు ముందు ఓఆర్ 66 శాతం ఉండగా ఇప్పుడు 75 శాతానికి చేరింది. ప్రయాణికుల ఆక్యూపెన్సీ రేటు ఏలూరు జిల్లాలో 13 శాతం, పశ్చిమలో తొమ్మిది శాతం వరకూ పెరిగింది. ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిన అందుకు తగిన విధంగా బస్సులు ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. దీంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి.

చెయ్యెత్తినా ఆగని ఆర్‌టిసి బస్సులు

ప్రయాణికులు చెయ్యెత్తిన చోట ఆర్‌టిసి బస్సులు ఆగుతాయనే నినాదాన్ని పూర్తిగా తుంగలో తొక్కేసిన పరిస్థితి నెలకొంది. పట్టణాల్లోని బస్టాండ్లలో తప్ప మధ్యలో గ్రామాల్లోని బస్టాప్‌ల్లో ఆర్‌టిసి బస్సులు ఆగడం లేదు. ప్రయాణికులు చెయ్యెత్తినా బస్సు ఖాళీ లేదంటూ వెళ్లిపోతున్న పరిస్థితి ఉంది. దీంతో ప్రయాణికులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఎంతోమంది మహిళలు సైతం ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఏలూరు నుంచి రావులపాలెం వెళ్లే బస్సులు ఆశ్రం వద్ద కూడా ఆగడం లేదు. తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వచ్చే బస్సులు వంతెనపైన ఏలూరు వెళ్లే రోడ్డులో ఆగని పరిస్థితి ఉంది. ఒకవేళ అతికష్టంపై బస్సు ఎక్కినా గమ్యస్థానం వరకూ నిలబడే ప్రయాణం చేయాల్సి వస్తోంది. వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమయానికి బస్సులు రాకపోవడంతో గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. భీమవరం నుంచి తాడేపల్లిగూడెం రావాలంటే ప్రయాణికుల అవస్థలు చెప్పుకోనవసరం లేదు. ఉచిత బస్సు పథకం పెట్టిన ప్రభుత్వం అందుకు తగిన బస్సుల సంఖ్యను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికుల్లో తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉచిత బస్సుతో ప్రభుత్వానికి అనుకున్నంత లబ్ధి రాకపోగా, వ్యతిరేకత పెరుగుతున్న పరిస్థితి ఉంది. ఇప్పట్లో కొత్త బస్సులు వచ్చే అవకాశం లేదని జిల్లాలోని ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వం అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చెప్పొచ్చు.



జెసికి మెమోరాండం అందజేస్తున్న ఫ్యాప్టో నేతలు

బోధనేతర పనులను బహిష్కరిస్తున్నాం

జిల్లా ఫ్యాప్టో నేతల స్పష్టీకరణ

జెసి, డిఇఒకు ఫ్యాప్టో మెమోరాండం అందజేత

ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకొస్తే ఊరుకోం

ఫ్యాప్టో ఛైర్మన్ విజయరామరాజు, సెక్రటరీ జనరల్ ప్రకాశం

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 10వ తేదీ నుంచి బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు జిల్లా ఫ్యాప్టో నేతలు తేల్చి చెప్పారు. గూగుల్ షీట్స్ నింపడం, విద్యాశక్తి, జిఎస్‌టి 2.0తోపాటు సీజనల్ ప్రచార కార్యక్రమాలకు స్వస్తి పలుకుతున్నట్లు స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఇఒకు ఫ్యాప్టో నేతలు గురువారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ పిఎస్.విజయరామరాజు, సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం మాట్లాడారు. మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వల్ల బోధన సమయం హరించుకుపోతుందన్నారు. ఉపాధ్యాయులకు బోధనపై ఆసక్తి తగ్గిపోయేలా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బోధనేతర పనుల నుంచి మినహాయించాలని పలుదఫాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఏమాత్రం పట్టించుకోకుండా ఉపాధ్యాయుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఫ్యాప్టో పిలుపులో భాగంగా ఈ నెల 10వ తేదీ నుండి బోధనేతర కార్యక్రమాలను బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారని తెలిపారు. మూల్యాంకానికి సంబంధించి పరీక్ష నిర్వహణ తప్ప ఏ ఇతర బోధనేతర పనులు చెయ్యబోరని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకొస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మెమోరాండం అందించిన వారిలో ఫ్యాప్టో కోఛైర్మన్లు పి.సాయివర్మ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ రమణ ఉన్నారు.

వీరవాసరం: ఈ నెల పదో తేదీ నుండి బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో మండల నేతలు ప్రకటించారు. ఈ మేరకు గురువారం మండల విద్యాశాఖాధికారికి మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎన్.ప్రసాద్‌బాబు, డి.శ్రీనివాస్, కె.సురేష్, ఆర్.ఏడుకొండలు పాల్గొన్నారు.

నరసాపురం: ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం మోపడం సరికాదని ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం ఆందోళన నిర్వహించారు. శుక్రవారం నుంచి బోధనేతర పనులు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎంఇఒ-2 జాన్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పి.కృష్ణకుమారి, ఎన్.సత్యనారాయణ, అజయ్‌కుమార్, శ్యాంసన్, కె.మాణిక్యాలరావు, చంద్రకుమార్, ఎం.సుధీర్‌బాబు, డి.రమేష్‌బాబు, జి.జయదేవ్ పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల పనులు ప్రారంభించాలి

42 పుష్కర ఘాట్లలో సౌకర్యాల కల్పనకు ప్రణాళిక - జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు సంబంధించిన పనులు ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. 42 పుష్కర ఘాట్లలో సౌకర్యాల కల్పనకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా బడ్జెట్ రూపకల్పనపై రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, పిఆర్, ఆర్‌అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపల్, ఎలక్ట్రికల్, ఫైర్, కన్జర్వెన్సీ, మెడికల్ శాఖల జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. పుష్కరాలకు వచ్చే యాత్రికుల సౌకర్యార్థం చేపట్టాల్సిన పనులు, అంచనా వ్యయానికి సంబంధించి శాఖలవారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా పనులపై దిశా నిర్దేశం చేశారు. 42 పుష్కర ఘాట్లకు మరమ్మతులు, అప్రోచ్ రోడ్లు, లైటింగ్, తాగునీరు, శానిటేషన్, టాయిలెట్స్, ఆలయాల మరమ్మతులు, మున్సిపాలిటీల్లో బీటీ రోడ్లు, డ్రెయిన్స్, ఏటిగట్టు సుందరీకరణ పనులు, నరసాపురం, పాలకొల్లు పట్టణాల్లో వసతి గృహాలకు మరమ్మతులు, హైవేల్లో రోడ్డు మధ్యలో, ఇరువైపులా స్వాగత ద్వారాలు, జనరేటర్లు, మెడికల్ క్యాంపుల పనులకు సంబంధించి ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. మార్పులు, చేర్పులుంటే శనివారంలోపు నివేదికలను సిద్ధం చేసి అందించాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఎఎస్‌పి వి.భీమారావు, డిపిఒ రామ్నాథ్‌రెడ్డి, జిల్లా టూరిజం శాఖాధికారి ఎవి.అప్పారావు, జిల్లా విద్యుత్ శాఖాధికారి ఉషారాణి, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి కె.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బి ఎస్ఇ ఎ.శ్రీనివాసరావు, నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి



వయోవృద్ధులను సత్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

వైద్యుడు లేకుండా వైద్య సేవలేలా..!

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం చినపేటలో 104 వాహనం ద్వారా వైద్యుడు లేకుండానే వైద్య సేవలందించడంపై స్థానికులు విస్మయం, ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం చినపేటలో 104 వాహనం ద్వారా వైద్యుడు లేకుండా సిబ్బందే మందులు అందజేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇంటి వద్దకే ప్రాథమిక వైద్య సేవలను ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో అమలవుతున్న 104 సేవలను కేవలం వైద్య సిబ్బందితో సరిపెట్టించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. వైద్యుడు లేకుండా అందించే సేవలు దేనికని పెదవి విరుస్తున్నారు. వైద్యుడు లేకుండా 104 వాహనం రావడం వల్ల పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదని వృద్ధులు, మహిళలు వాపోతున్నారు. గతంలో ఇచ్చిన మందులనే కొనసాగించాలని సిబ్బంది చెబుతున్నారంటున్నారు. బిపి, షుగర్ వ్యాధులతోపాటు ఇతర చిన్న రుగ్మతలను తమకున్న పరిజ్ఞానంతో వైద్య సిబ్బంది మందులు అందజేస్తున్నారు. దీంతో వారిచ్చిందే మందు అనే రీతిలో గ్రామీణ పేదలు సరిపెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అదే వైద్యుడు ఉంటే తమ ఆరోగ్య పరిస్థితిపై వైద్యునితో ప్రాథమిక పరీక్షలు చేయించుకుని, ఆయన ఇచ్చే సలహాతో సంతృప్తి పడే అవకాశం ఉంటుందంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి 104 వాహనాల్లో వైద్యుడిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వైద్యులు లేకుండానే వీరవాసరం చినపేటలో సేవలందిస్తున్న సిబ్బంది

పెద్దలను గౌరవించడం నేర్పాలి

కుటుంబ విలువలు తగ్గిపోవడంతోనే సమస్యలు - కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

చిన్ననాటి నుండే పెద్దలను గౌరవించడం పిల్లలకు తల్లిదండ్రులు నేర్పితేనే వయోవృద్ధుల సమస్యలు రావని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బ్యాంక్ కాలనీలోని శ్రీ కృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి ఫంక్షన్ హాల్‌లో గురువారం జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఇంట్లో వృద్ధులు ఉండడం గొప్పగా అనుభూతి చెందాలని, వారి అనుభవం, ఆసరా, పెద్దరికం ప్రతిఒక్క కుటుంబానికి వెన్నుదన్నుగా ఉంటాయని అన్నారు. భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రులకు, గురువులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో చిన్న కుటుంబాలుగా మారడం, కొంత విలువలకు ప్రాధాన్యత తగ్గడంతో వృద్ధులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇది సరైనది కాదని అన్నారు. ప్రతిఒక్కరూ వారి బాల్యంలో తల్లిదండ్రులు చేసిన సేవలను చిరస్థాయిగా గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వయోవృద్ధుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వృద్ధులకు సంబంధించి ఏదైనా ఘటన జరిగినప్పుడు జిల్లా యంత్రాంగం సుమోటోగా తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంక్షేమ నియమావళిపై అవగాహన కరదీపికను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన సంఘ నాయకుల్లో విశిష్ట సేవలు అందించిన వారిని కలెక్టర్ సత్కరించి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్, జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అడ్డాల నాగసూర్య సత్యనారాయణ, శ్రీ కృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి కార్యదర్శి మెంటే పార్థసారథి, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ అధికారి దాయన సురేష్ చంద్రాజీ, వయోవృద్ధుల జిల్లా అప్పిలేట్ ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుసునూరి రామచంద్రరావు, సంయుక్త కార్యదర్శి వీర రాఘవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొటికలపూడి చిట్టివెంకయ్య, భీమవరం సంఘం సహ అధ్యక్షులు ప్రొఫెసర్ మట్లపూడి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బోనం పాండు రంగారావు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

పని గంటల పెంపును రద్దు చేయాలి

సిఐటియు పట్టణ మహాసభ డిమాండ్ -నూతన కన్వీనర్‌గా జవ్వాది శ్రీను ఎన్నిక

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, 8 గంటల పనిదినాని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను, స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేసి కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు పట్టణ తొమ్మిదో మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సిఐటియు పట్టణ మహాసభ తీర్మానాలను పట్టణ కన్వీనర్ జవ్వాది శ్రీను పత్రికలకు విడుదల చేశారు. నూతన కమిటీ ఎన్నిక జరిగిందని, కన్వీనర్‌గా జవ్వాది శ్రీను, మరో 29 మంది సభ్యులుగా కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని తెలిపారు.



మాట్లాడుతున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి లక్ష్మీనారాయణ

డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి డిసెంబర్ 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నామని, కక్షిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాసంస్థ ఛైర్మన్, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ నెల 18న అసంఘటిత కార్మికులు, బాలల కోసం ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ సేవా సదస్సు ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ, డిఆర్‌డిఎ, కార్మిక, మహిళా శిశుసంక్షేమం, విద్య, పోలీస్, మున్సిపల్ శాఖల అధికారులు ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. అలాగే జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులు పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు. సమావేశంలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.హనీషా, 2వ అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎన్.జ్యోతి పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పని చేయాలి

ఎఎంసి పాలకవర్గ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరి

ప్రజాశక్తి - ఉండి

రైతుల శ్రేయస్సే లక్ష్యంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పని చేయాలని స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. గురువారం ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ తొలి సాధారణ సమావేశం ఛైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో తొలుత సెప్టెంబర్ ఆదాయ, వ్యయాలను సమీక్షించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధికి, మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ సెప్టెంబర్‌లో రూ.81 లక్షల మిగులును సమకూర్చుకున్నప్పటికీ మరింత ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గ కేంద్రం ఉండిలో సరైన ఫంక్షన్ హాల్ లేదని, మార్కెట్ కమిటీ ప్రాంగణంలో మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపడితే పార్కింగ్ సౌకర్యం ఉంటుందని అన్నారు. దీనికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ యడవిల్లి వెంకటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



నరసాపురంలో ఆందోళన చేస్తున్న నాయకులు

మానసిక ఆరోగ్యమే మిన్న

ప్రజాశక్తి - తణుకు

శారీరక ఆరోగ్యంకన్నా మానసిక ఆరోగ్యమే మిన్న అని మానసిక వైద్యులు డాక్టర్ బి.రమేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ప్రగతి జూనియర్ కాలేజీలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఇండియన్ సైకియాట్రిక్ అసోసియేషన్, మానస హాస్పటల్ తణుకు వారి ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం ప్రగతి జూనియర్ కాలేజీ విద్యాసంస్థల డైరెక్టర్ ఎంఎస్ఆర్.ఆంజనేయులు (ప్రగతి రాజా) అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.రమేష్‌కుమార్ మాట్లాడుతూ మానవుని తెలివితేటలు అంబరాన్ని తాకి మనుగడకు కావాల్సిన అన్ని సౌకర్యాలు పొందుతున్నా అంతులేని సమస్యల వలయంలో మనిషి జీవితం చిక్కుకుపోతోందన్నారు. సమస్యల కారణంగా మానసిక ఒత్తిడి మరింత పెరిగి ప్రశాంత జీవితానికి చాలామంది దూరమవుతున్నారన్నారు. ఇది మానసిక రుగ్మతలకు దారి తీస్తుందన్నారు. అవగాహనా రాహిత్యం సమస్యలను మరింత జఠిలం చేస్తున్నాయన్నారు. నేటి ఆధునిక జీవితంలో సరైన ప్రణాళిక లేకపోవడంతో ఒత్తిడికి లోనై మానసికంగా ఒంటరై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రతి విద్యార్థీ చిన్నప్పటి నుండి సరైన ప్రణాళికతో ఎప్పుడు చేయాల్సిన పని అప్పుడే చేయడం, చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండటం మంచిదన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలే తప్ప దాని వల్ల ఇబ్బందులు కొని తెచ్చుకోకూడదన్నారు. ఎంఎస్ఆర్ ఆంజనేయులు (ప్రగతి రాజా) మాట్లాడుతూ మానసికంగా బలంగా ఉన్నప్పుడే మనం సంఘ జీవనంలో ఉత్తమంగా నిలబడగలమని, ఆత్మ స్థయిర్యాన్ని పెంపొందించుకుని ఆదర్శంగా ఉండగలమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సిజెఐపై దాడిని ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి - నరసాపురం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్లో గురువారం ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనకు న్యాయవాదులు, సిపిఎం నేతలు, ఎస్‌సి నేతలు సంఘీబావం తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నినదించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు దొండపాటి స్వామి, సోదడాసి శ్రీధర్, కవురు పెద్దిరాజు, కానూరి బుజ్జి మాట్లాడుతూ భారత జాతిని అవమానపర్చే విధంగా దాడి జరిగిందన్నారు. సిజెఐపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తామన్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నెక్కంటి క్రాంతికుమార్, పూరిళ్ల శ్రీనివాస్, పొగాకు పూర్ణ, కట్టా వేణుగోపాలకృష్ణ, సుధీర్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎన్‌లో వర్క్‌షాప్

ప్రజాశక్తి - నరసాపురం

వైఎన్ కళాశాలలో ఇన్నోవేషన్, ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్మెంట్ సెంటర్, ఐక్యూఎసి ఆధ్వర్యంలో 'ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్మెంట్ అండ్ కస్టమర్ పెర్సెప్షన్' అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌నకు హైదరాబాద్ అసిస్టెంట్ సర్వీసెస్ లిమిటెడ్ అసోసియేట్ మేనేజర్ కె.సుబ్బారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలోనే వ్యాపార, వాణిజ్య సంస్థలను ఎలా స్థాపించాలి ఆలోచించాలన్నారు. కావాల్సిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కస్టమర్ పెర్సెప్షన్ అంటే సంస్థ నుండి ఎటువంటి ఉత్పత్తులను కోరుకుంటున్నారు అన్న డేటాను ముందుగానే తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, వైస్ ప్రిన్సిపల్స్ కెఎస్‌వి రంగారావు, బి.వెంకట రత్నం, ఐక్యూఎసి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గంధం శ్రీరామకృష్ణ, హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ ప్రొఫెసర్ చినమిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సేవలు భేష్

ప్రజాశక్తి - కాళ్ల


కాళ్లకూరులో అన్న సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్లకూరులో నిర్వహిత ఉత్సవాలకు దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ దాట్ల వెంకట రామరాజు నాలుగేళ్లుగా అన్న సమారాధన చేయడం అభినందనీయమని మాజీ దేవస్థాన చైర్మన్ అడ్డాల నాగరాజు అన్నారు. కాళ్లకూరులో నిర్వహిత మందిరం 16వ వార్షికోత్సవం సందర్భంగా దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దాట్ల వెంకట రామరాజు ఆర్థిక సాయంతో అన్న సమారాధన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళ్లకూరు సొసైటీ చైర్మన్ ప్రణవమూర్తిరాజు, దాట్ల సత్యనారాయణరాజు, ఫాదర్ తోట గాబ్రియేలు, లక్ష్మణమూల డేవిడ్, సంఘం పెద్దలు వీలి బాలస్వామి, మామిడ్ల జాన్, ఈడా మోహన్, పారిపూడి జోసెఫ్, పొద్దువాక యేసేపు పాల్గొన్నారు.

విజయలక్ష్మికి పొట్నూరి ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పొట్నూరి ఫౌండేషన్ సహకారంతో పాలకొల్లు పల్లపువీధిలో నివాసం ఉంటున్న పెంటపాటి విజయలక్ష్మికి టిఫిన్ బండి అందజేశారు. ఆమె భర్త మరణించడంతో ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తోంది. ఈ మేరకు శుక్రవారం టిఫిన్ అమ్ముకోవటానికి పొట్నూరి ఫౌండేషన్ తోపుడు బండిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పొట్నూరి ఫౌండేషన్ చైర్మన్ పొన్నూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


చిరుధాన్యాల ఉత్పత్తులను తిలకిస్తున్న అంగన్వాడీలు

చిరు ధాన్యాలతో కేన్సర్‌కు విముక్తి

డాక్టర్ దెబోరా మెస్సియానా

ప్రజాశక్తి - ఉండి

చిరుధాన్యాలను ఆహారంలో తీసుకుంటే కేన్సర్ నుంచి విముక్తి పొందొచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దెబోరా మెస్సియానా అన్నారు. గురువారం ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ 8వ పోషకాహార మాసోత్సవాల సందర్భంగా చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దెబోరా మెస్సియానా మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం, ఆహార కల్తీ, ఒత్తిడి వల్ల ఎన్నో వ్యాధులు వస్తున్నాయని, ఆ కేన్సర్ నుంచి విముక్తి పొందాలంటే చిరుధాన్యాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తీసుకునే ఆహారం వల్ల మధుమేహం వస్తోందన్నారు. వాటిని నియంత్రించడానికి చిరుధాన్యాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలు తీసుకునే వారిలో 8 శాతం చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుందని, జీర్ణక్రియ మెరుగుపడుతుందని తెలిపారు. అనంతరం చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార ఉత్పత్తులను ప్రయోగపూర్వకంగా ప్రదర్శించి వాటి ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పితాని సత్యనారాయణ

ఇచ్చిన హామీలు అమలు

ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని మార్టేరు సెంటర్లో ఆటో డ్రైవర్ల సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు హాజరై ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల 90 వేల మందికిగాను రూ. 460 కోట్లు అందజేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. ఆటో డ్రైవర్లపై ఉన్న పాత కేసులను తొలగించేందుకు ప్రయత్నం చేస్తామని, ఇన్సూరెన్స్ కూడా తగ్గే విధంగా, షేర్ ఆటోలో లోడు వేసుకెళ్లినప్పటికీ ఏ విధమైన కేసులు పెట్టకుండా అధికారులకు ఉత్తర్వులు జారీ చేస్తామని, ప్రతి ఆటో డ్రైవర్ సమస్యనూ అసెంబ్లీలో గళమెత్తి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని నిమ్మల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆచంట నియోజవర్గం నుండి నాలుగు మండలాల ఆటో డ్రైవర్లు హాజరయ్యారు. పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

కృష్ణా ఎస్‌పిని కలిసిన కొవ్వలి

ప్రజాశక్తి - నరసాపురం

ఇటీవల కృష్ణా జిల్లా ఎస్‌పిగా నియమితులైన నరసాపురానికి చెందిన వి.విద్యాసాగర్‌నాయుడును టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు గురువారం మచిలీపట్నం ఎస్‌పి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్‌పి విద్యాసాగర్‌కు అభినందనలు తెలిపారు.


ఎస్‌పి విద్యాసాగర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కొవ్వలి

వరిపై తెగుళ్ల విజృంభణ

ఆందోళనలో రైతులు - పట్టని అధికారులు

ప్రజాశక్తి - కాళ్ల

వాతావరణ మార్పుల కారణంగా వరి కీలక దశలో ఉన్న నేపథ్యంలో చీడపీడలు చుట్టు ముడుతున్నాయి. దీనికి ఎలుకల బెడద తోడైంది. సస్యరక్షణ చర్యలు చేపడుతున్నా ఉపశమనం లభించకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లాలో 1,93,830 ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతోంది. 70 శాతానికిపైగా విస్తీర్ణంలో ఎంటియు 1318, మిగిలిన 30 శాతంలో ఎంటియు 7029, ఎంటియు 1121 రకాలను రైతులు సాగు చేశారు. ఇప్పటికే అధికంగా పెట్టుబడులు పెట్టామని, ఇప్పుడు తెగుళ్ల నివారణకు అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో వరి ఈనిక, పొట్ట, చిరుపొట్ట దశల్లో ఉంది. ప్రస్తుతం వరికి తెగుళ్ల సోకి రైతుకు తీరని నష్టాన్ని మిగుల్చుతున్నాయి. ప్రాథమిక దశలోనే తెగుళ్లను గుర్తించి మందులు పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఆగస్టులో నాట్లు వేసిన ప్రాంతాల్లో అగ్గి, తాటాకు, ఆకుముడత తెగుళ్ల అధికంగా ఉన్నాయి. రైతుల నుంచి సమాచారాన్ని అందుకున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తెగుళ్ల నివారణకు సూచనలు ఇస్తున్నారు.

వరిపై తెగుళ్ల విజంభణ..

ఏపుగా పెరుగుతున్న తరుణంలో వాతావరణం అనుకూలించక తెగుళ్ల దాడి పెరిగింది. సార్వా పైరుపై తెగుళ్ల లక్షణాలు కనిపిస్తున్నాయి. దీంతో రైతులు, కౌలు రైతులు పురుగుమందుల కోసం దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగానే తెగుళ్ల సోకుతున్నాయని శాస్త్రవేత్తలు చెబు తున్నారు. ప్రస్తుతం బ్యాక్టీరియా ఎండాకు, ఆకుముడత తెగుళ్ల వ్యాప్తి ఎక్కువగా ఉంది. ఆకునల్లి మాని పండ్లు, పొడ తెగులు సైతం అక్కడక్కడా కనిపిస్తున్నాయి. మరోపక్క కొన్ని ప్రాంతాల్లో గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో ఎలుకల బెడద పెరగడంతో రైతాంగాన్ని కలవరపెడుతోంది. సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల సామూహిక నివారణ చర్యలు చేపట్టినా వర్షాల ప్రభావంతో సత్ఫలితాలు రాలేదని రైతులు చెబుతున్నారు.


సీసలి ప్రాంతంలో క్రిమి సంహారక మందు పిచికారీ చేస్తున్న కౌలు రైతు

అనుకూలించని వాతావరణం..

సార్వా ఏపుగా పెరిగే దశలో తెగుళ్ల ఆశించడం వల్ల మందులు పిచికారీ చేసినా ఆ ప్రభావం దిగుబడిపై పడుతోంది. రైతులు, కౌలు రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో క్రిమిసంహారక మందులు సరిగ్గా పని చేయని పరిస్థితి.

పెరుగుతున్న పెట్టుబడి..



కొల్లి నాగ శ్రీనివాస్, కౌలురైతు, దొడ్డనపూడి

నారుమళ్ల దశ నుంచి పంట చేతికొచ్చే వరకూ వరి సాగుకు పెట్టుబడులు పెడుతునే ఉన్నాం. చివరికి అప్పుల పాలవుతున్నాం. సాగుకు మామూలుగా పెట్టే పెట్టుబడితోపాటు తెగుళ్ల సోకడం వల్ల అదనపు పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది.

అదనంగా ఖర్చు అవుతోంది..

జె.శ్రీనివాస్, కౌలు రైతు, దొడ్డనపూడి

ఐదెకరాల్లో వరి సాగు చేస్తున్నా. పంట పొట్ట దశకు చేరాక ఎండాకు, ఆకు ముడత తెగుళ్ల ఆశించాయి. వీటి నివారణకు సుమారు రూ.15 వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నా..



పి. రమేష్ నాయుడు, మండల వ్యవసాయాధికారి, కాళ్ల

క్షేత్రస్థాయిలో పర్యటించి వరి పైరుకు సోకుతున్న తెగుళ్లను పరిశీలిస్తున్నాం. రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నాం. తెగుళ్ల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఎరువులు, పురుగుమందులు తగు మోతాదులో వాడేలా సూచిస్తున్నాం. పంట పాడవకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బాణసంచా దుకాణాల్లో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని బాణసంచా తయారీ కేంద్రాలను, బాణసంచా దుకాణాలను ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. చిట్టవరం, సరిపల్లి, లక్ష్మణేశ్వరం గ్రామాల్లోని బాణసంచా లైసెన్స్ దుకాణాలు, వాటి గూడౌన్లను తనిఖీ చేశారు. స్టాక్ వివరాలపై ఆరా తీశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు లైసెన్స్ తయారీ కేంద్రాలకు సీల్ చేశామన్నారు. అనధికారికంగా బాణసంచా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనధికారంగా బాణసంచా విక్రయించినా, నిల్వచేసినా 100, 101, 112 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. **నరసాపురం**


నరసాపురం : తనిఖీలు చేస్తున్న అధికారులు


ఆకివీడులో తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఐవివి సత్యనారాయణ అన్నారు. గురువారం చిట్టవరం గ్రామంలోని మూడు బాణసంచా విక్రయ షాపులను స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె.భాస్కర్ రామమ్, రూరల్ ఎస్ఐ టి.వెంకట సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపు యజమానులకు, సిబ్బందికి అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో చేసి చూపించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణలో ప్రజలందరూ అవగాహన పెంపొందించుకొని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణ ప్రజలందరి బాధ్యత అని తెలిపారు. ప్రమాదాలు సంభవించినప్పుడు 101 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

గణపవరం : దీపావళి దుకాణాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అలాకాకుంటే చర్యలు తీసుకుంటామని నిడమర్రు సిఐ నక్కా రజనీకుమార్ హెచ్చరించారు. గురువారం పిప్పరలోని బాణసంచా హోల్ సేల్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందుగుండు సామగ్రి దుకాణాల యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గణపవరం ఎస్ఐ ఎం.మణికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆకివీడు : బాణసంచా విక్రయ దుకాణాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని లేకుంటే పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. మండలంలో అచ్చమూరు కాలువ గట్టున ఉన్న హోల్‌సేల్ బాణసంచా దుకాణాన్ని ఆయన గురువారం సాయంత్రం తనిఖీ చేసి మాట్లాడారు. ఇసుక, నీరు తగిన స్థాయిలో నిల్వ చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలకు మార్గం ఏర్పడుతుందన్నారు. ఆ రకమైన అవకాశాలు ఎవరూ కల్పించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలా పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో ప్రారంభించబోయే రిటైల్ దుకాణాల వారు కూడా పూర్తి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది అధికారులు, అగ్నిమాపక శాఖ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవలకు పురస్కారాలు


కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా పలువురికి అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - భీమవరం

వయోవృద్ధుల జిల్లా అప్పిలేట్ ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్‌కు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. భీమవరం శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల రాష్ట్రస్థాయి అవార్డును పొందిన వయోవృద్ధుల జిల్లా అప్పిలేట్ ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్‌ను కలెక్టర్ నాగరాణి ఘనంగా సత్కరించారు. మేళం దుర్గాప్రసాద్ జిల్లాలో వృద్ధుల సమస్యలపై స్వయంగా పర్యవేక్షిస్తూ, పలువురు వృద్ధులకు సేవలు అందించినందుకు గాను రాష్ట్రస్థాయి అవార్డుకు వీరు ఎంపిక కావడం అభినందనీయమన్నారు.


భీమవరం : దుర్గాప్రసాద్‌కు అవార్డు అందిస్తున్న కలెక్టర్

దుర్గాప్రసాద్ సేవలు ప్రశంసనీయమని, ఒక్క రూపాయి పారితోషికం తీసుకోకుండా ప్రతివారమూ జిల్లా కలెక్టరేట్లో నిర్వహించే పిజిఆర్ఎస్‌లో వృద్ధుల సమస్యలపై ఉచిత సర్వీస్ చేయడం అభినందించాల్సిన విషయమన్నారు. వృద్ధుల సమస్యల పరిష్కారంపై వారికి పూర్తి అవగాహన ఉందని, ఇప్పటివరకు చాలా కేసులను ట్రిబ్యునల్ ద్వారా పరిష్కరించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అడ్డాల నాగ సూర్య సత్యనారాయణ, శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి కార్యదర్శి మెంటే పార్థసారథి, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ అధికారి దాయన సురేష్ చంద్రజీ, రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుసునూరి రామచంద్రరావు, సంయుక్త కార్యదర్శి వికె.వీర రాఘవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటికలపూడి చిట్టివెంకయ్య, భీమవరం సంఘం సహా అధ్యక్షులు ప్రొఫెసర్ మట్లపాడి సత్యనారాయణ పాల్గొన్నారు.


ఆకివీడు :అవార్డు అందుకుంటున్న బంగారయ్య

పెనుమంట్ర : ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా భీమవరంలోని శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ నాగరాణి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ విభాగంలో బాగా కృషి చేసిన వారిని సత్కరించారు. పెనుమంట్ర మండల యూనిట్ నుండి ఓడూరు గ్రామానికి చెందిన విశ్రాంత డిగ్రీ కళాశాల సూపరింటెండెంట్ చిలువూరి శివరామరాజు, వెలగలేరు గ్రామానికి చెందిన పడాల కేశవరెడ్డిని కలెక్టర్ సత్కరించారు. సన్మాన గ్రహీతలను పలువురు అభినందించారు.

ఆకివీడు : సర్ ఆర్థర్ కాటన్ మండల వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్యకు ఉత్తమ సేవకుడిగా జిల్లా కలెక్టర్ అవార్డు అందజేశారు. వృద్ధుల సంఘం స్థాపించి వారి హక్కుల ప్రచారంలోనూ, చట్టంపై వృద్ధులకు అవగాహన కల్పించడంలోనూ బంగారయ్య ముందున్నారని ప్రశంసిస్తూ కలెక్టర్ అవార్డు అందజేశారు. వృద్ధుల జాతీయ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఈ అవార్డు అందజేసినట్లు ఆయన గురువారం తెలిపారు. సుమారు గత 40 సంవత్సరాలుగా వినియోగదారుల సంఘాల రాష్ట్ర కార్యదర్శిగా ఆయన అందించిన సేవలకు ఇప్పటికే వందలాది పురస్కారాలు అందుకున్నారు. పురస్కారం పొందిన బంగారయ్యను వృద్ధుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు ఎంవి.సూర్యనారాయణ రాజు, ఉపాధ్యక్షుడు నేరెళ్ల ఆదినారాయణ, కార్యదర్శి అడవి సుబ్బారావు ప్రసాదరావు అభినందించారు.

పిహెచ్‌సిల్లో జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి - కాళ్ల

జిఎస్‌టి తగ్గింపు వల్ల ప్రజలకు సొమ్ము ఆదాతో పాటు ఆరోగ్యానికి ఊరట కలుగుతుందని పిహెచ్‌సి ఇన్‌ఛార్జి వైద్యాధికారి డాక్టర్ కె.లిఖిత అన్నారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిఎస్‌టిపై అవగాహనా సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సదస్సుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి డాక్టర్ జి.స్వాతి అధ్యక్షత వహించారు. ఎంపిడిఒ జి.స్వాతి మాట్లాడుతూ ప్రాణరక్షణ మందులపై 12 శాతం నుండి 5 శాతం తగ్గుతుందన్నారు. టెస్టింగ్ కిట్స్‌పై 12 శాతం నుంచి 5 శాతం శ్లాబ్ కిందకు రానున్నాయన్నారు. అనంతరం గ్రామాల్లో ప్రదర్శనగా వెళ్లి స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి బి.సతీష్, వైద్య సిబ్బంది, మెడికల్ షాపుల యజమానులు, ప్రజలు పాల్గొన్నారు.

గణపవరం : గణపవరం పిహెచ్‌సిలో జిఎస్‌టిపై అవగాహనా సదస్సు గురువారం నిర్వహించారు. ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గింపు వల్ల ప్రజలకు ఆదాతో పాటు ఆరోగ్యానికి ఊరట కలుగుతుందన్నారు. అనంతరం గ్రామాల్లో ప్రదర్శన నిర్వహించి స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు మాట్లాడారు. ప్రదర్శనలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరవాసరం : వీరవాసరం, కొణితివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ (జిఎస్‌టి 2.0)పై అవగాహన కార్యక్రమాన్ని పిహెచ్‌సిలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిఎస్‌టి 2.0లో తగ్గిన మందులు, పరికరాలు, బీమాపై తగ్గిన వివరాలను వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.అప్పారావు, వైద్యాధికారులు రాజేష్, డేనియల్ రాజు, ప్రయివేటు మందులు షాపుల యజమానులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: లంకలకోడేరు పిహెచ్‌సి పరిధిలో సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై సచివాలయాలు, హైస్కూళ్లు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ తాళ్ల మూర్తిబాబు పాల్గొని జిఎస్‌టి ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం గ్రామస్థాయిలో ప్రతి ఇంటికీ జిఎస్‌టి కరపత్రాలు పంపిణీ చేసినట్లు మూర్తి బాబు తెలిపారు. చింతపర్రు సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు, లంకలకోడేరు గ్రామ నాయకులు నెక్కంటి ఆదినారాయణ, పి.సత్యనారాయణ రాజు, నెక్కంటి దుర్గాప్రసాద్, గవరపేట సర్పంచి పొలిమేర వెంకటేశ్వరరావు, శివదేవుని చిక్కాల కోపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ వడ్డే సోమశేఖర్ పాల్గొన్నారు.


గణపరంలో అవగాహనా ర్యాలీ

మొగల్తూరు : కొత్త జిఎస్‌టి విధానం అమలుతో నిత్యావసర సరుకుల ధరలు గణనీయంగా తగ్గి, సాధారణ ప్రజల జీవనంలో ఊరట కలుగుతోందని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. తెలిపారు. ముత్యాలపల్లి గ్రామంలో గురువారం సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఉన్న దుకాణాల వద్దకు వెళ్లి జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. స్థానిక దుకాణాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిఎస్‌టి 2.0 ద్వారా లభిస్తున్న ప్రయోజనాలను దుకాణదారులు ప్రజలకు అందించాలని సూచించారు. సర్పంచి అడ్డాల సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, నాయకులు కత్తి ముండ ముత్యాలరావు నాగిడి రాంబాబు, కొల్లాటి బాలకృష్ణ, తిరుమాని భాస్కరరావు, కొల్లాటి పెంటయ్య, మూలస్వామి, కర్రి వీరాస్వామి, నాయకులు పాల్గొన్నారు.

వైఎన్‌లో స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక వైఎన్ కళాశాలలో మేరా యువ భారత్, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, కళాశాల స్పోర్ట్స్ డిపార్టుమెంట్, ఐక్యూఎసి సంయుక్తంగా 'బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్'ని కళాశాలలో నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులకు రన్నింగ్, కబడ్డీ, జావాలిన్ త్రో, వాలీబాల్ కాంపిటీషన్ నిర్వహించారు. గెలుపొందిన వారికి మెడల్స్, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, నెహ్రు యువకేంద్ర యూత్ కోఆర్డినేటర్ కోసూరి రాజేష్, వైస్ ప్రిన్సిపల్స్ కెఎస్‌వి.రంగారావు, బి.వెంకటరత్నం, ఐక్యూఎసి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గంధం శ్రీరామకృష్ణ, హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ ప్రొఫెసర్ చినమిల్లి శ్రీనివాస్, తెలుగు విభాగాధిపతి ఎస్.యాకోబు పాల్గొన్నారు.

కాళ్లకూరులో హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఉదయం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఆకివీడు పెద్దింట్లమ్మ ఆలయ ఇఒ ముదునూరు సత్యనారాయణరాజు పర్యవేక్షణలో 106 రోజులకుగాను స్వామివారి హుండీ లెక్కించారు. రూ.22 లక్షల 32 వేల 317 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా చెరువు కబ్జాకు యత్నం

న్యాయం చేయాలని వెంకటేశ్వర్లు ఆవేదన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని వారతిప్ప గ్రామంలో తన 97 సెంట్ల ఆక్వా చెరువును కబ్జా చేసేందుకు కొంతమంది వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని గ్రామానికి చెందిన కొప్పనాతి వెంకటేశ్వర్లు గురువారం విలేకరులకు తెలిపాడు. ప్రభుత్వం తన తండ్రికి డినమోనా పట్టా ఇచ్చిందన్నారు. సాగు చేసుకునే హక్కు కల్పించినప్పటికీ ఆ భూమిని కబ్జా చేయాలని ఓ భూస్వామి కొంత మందిని పంపి తమ చెరువును స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నాడని, ప్రభుత్వ అధికారులు తనకు న్యాయం చేయాలని వెంకటేశ్వర్లు కోరాడు. దీనిపై కోర్టును ఆశ్రయించామని కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఆ భూస్వామి ఆ పొలం మాదే అంటూ కొంతమంది వ్యక్తులను పంపి తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ చెరువులో రొయ్యల సాగు చేసుకునేందుకు పిల్లలు వేసుకున్నామని తమకు తెలియకుండా చెరువులోని నీటిని బయటకు తోడేశారని, దీంతో తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరాడు.

జగన్ తీరు సరిగా లేదు

ఎంఎల్ఎ పితాని విమర్శ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మెడికల్ కాలేజీల వ్యవహారంలో మాజీ సిఎం జగన్ తీరు సరిగా లేదని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం పెనుమంట్రలో 'పల్లె పల్లెకు మన పితాని' కార్యక్రమంలో భాగంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గత ఐదేళ్లలో 17 మెడికల్ కళాశాలలు నిర్మాణం చేపడుతున్నామని చెప్పి కడప, పార్వతీపురంలో పనులు ప్రారంభించి కడపలో పూర్తి చేసి పార్వతీపురంలో 13 శాతం మాత్రమే చేశారని చెప్పారు. గత వైసిపి పాలనలో ఉత్తరాంధ్రలో మెడికల్ కాలేజీ కోసం స్వల్పంగా ఖర్చు చేసి, రుషికొండ ప్యాలెస్ కోసం రూ.500 కోట్లు ఖర్చు పెట్టారని విమర్శించారు. మెడికల్ కళాశాలలు త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు పిపిపి విధానం అవలంబిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి తాడిపర్తి ప్రియాంక, సొసైటీ అధ్యక్షులు జవ్వాది సురేష్ ఎంపిటిసి చింతపల్లి మంగతాయారు, టిడిపి మండల అధ్యక్షులు వెలగల బుల్లిరామిరెడ్డి, టిడిపి నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, గ్రామాధ్యక్షులు గంటా వాసు, జనసేన మండల అధ్యక్షులు కోయా వెంకట కార్తీక్, తహశీల్దార్ వై.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ జిఎస్‌టిపై అవగాహనుండాలి'

ప్రజాశక్తి - మొగల్తూరు

సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి సూచించారు. స్థానిక వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గురువారం మందులు, సర్జికల్ వస్తువులు, పరీక్షల పరికరాలపై తగ్గిన జిఎస్‌టిపై అవగాహన కార్యక్రమాన్ని పిహెచ్‌సి వైద్యురాలు జి.హేమ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఎంపిడిఒ మేడిది నవీన్‌కిరణ్, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, వైద్యసిబ్బంది కె.భాస్కరరావు, ఎం.రాజేష్‌చంద్ర, బి.శ్రీనివాసరావు, విజయలక్ష్మి సాంబశివరావు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే గ్రామాలాభివృద్ధి

ఎంపిడిఒ వి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి పాలనలో మెళకువలు తెలుసుకోవడం ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపిడిఒ వి.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పెంటపాడు, తణుకు మండలాల కార్యదర్శులు, సర్పంచులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్, రిసోర్స్‌పర్సన్లు మాట్లాడారు.